క్లుప్తంగా

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత



దేవరకద్ర: జీనుగరాలకి చెందిన ఆనంద్‌యాదవ్ హైదరాబాద్‌లోని సీఎంఆర్ కళాశాలలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. తన చదువుల నిమిత్తం ల్యాప్‌టాప్ అవసరం ఉందని ట్విట్టర్ ద్వారా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని సాయం కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆదివారం స్థానిక నాయకుల సమక్షంలో విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేశారు. బాగా చదువుకుని మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.

ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీ సమాజ్ ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యరావు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. బీసీ సమాజ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జాంద్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, నాయకులు డీకే నాయి, సత్యం, శేఖర్ పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్‌కు డాక్టరేట్

భూత్పూర్: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మేకల శ్రీనివాస్‌కు ఆదివారం న్యూఢిల్లీలోని సత్యసాయి ఆడిటోరియంలో డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. న్యూఢిల్లీలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ వర్సిటీ, వీర్చువల్ వర్సిటీ, యూఎస్‌ఏ ఫౌండర్, చైర్మన్ డా.పి మన్యుల్ చేతులమీదుగా ఆయన డాక్టరేట్ అందుకున్నారు.

చెట్లు నిల్.. కల్తీ కల్లు ఫుల్..

రాజాపూర్: మండలంలోని చొక్కంపేట్ గ్రామంలో ఈతచెట్లు లేకున్న కృత్రిమంగా తయారు చేసిన కల్తీకల్లు మాత్రం ఫుల్‌గా దొరుకుతోంది. వాస్తవంగా ఈత లేక తాటి చెట్ల నుంచి కల్లును సేకరించి విక్రయించుకోవాలని ప్రభుత్వం అనుమతులు ఇచ్చినా గ్రామంలోని కొందరు సంవత్సరానికి కొంత లీజ్ ఇచ్చి ఇతర గ్రామాలకు చెందిన వ్యక్తులతో కల్తీ కల్లును తయారు చేయించి.. జడ్చర్ల మండలంలోని కొన్ని గ్రామాలకు ఇక్కడి నుంచే కల్లును సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా ఈ గ్రామంలో విక్రయిస్తున్న కల్తీ కల్లులో కలిపే మత్తు మందు ఆల్ప్రాజోలంతోపాటు తెలుపుకోసం ఈస్ట్, చక్రిన్ తదితరాలను వాడుతున్నట్లు తెలుస్తోంది. మత్తు అధికంగా అధిక మోతాదులో ఉండటంతో.. దానికి అలవాటుపడిన వారు చుట్టు పక్కల గ్రామాల నుంచి ఇక్కడికి వచ్చి కల్లును తాగుతున్నారని తెలుస్తోంది. డిపోకు అనుమతులు లేకున్నా.. గ్రామంలో కల్లుడిపోను ఏర్పాటు చేసుకోవాలంటే సంబంధిత ఎక్సైజ్‌శాఖ నుంచి కచ్చితంగా అనుమతులు తీసుకోవాలి. కానీ ఇక్కడ అవేవి లేకున్న ఓ వ్యక్తి ఇక్కడికి వచ్చి ప్రతిరోజు గ్రామంలో ఓ ఇంటివద్ద డిపోను ఏర్పాటు చేసుకుని అక్కడే కల్లును తయారుచేసి గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. కాగా విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి ఫలితం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జడ్చర్ల ఎక్సైజ్ ఎస్‌ఐ నాగరాజును విషయంపై వివరణ కోరగా కల్లుడిపోకు అనుమతి లేదని తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

జడ్చర్ల: మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామ శివారులో గల వ్యవసాయ క్షేత్రంలో ఓ చెట్టు కింద పేకాట ఆడుతుండగా ఆదివారం పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. దాడుల్లో ముగ్గురు పోలీసులకు చిక్కారు. ఇద్దరు పేకాటరాయుళ్లు పారిపోయారు. కాగా రూ.2వేల నగదుతో పాటు నాలుగు మోటర్ బైక్‌లను పోలీసులు స్వాధీన పర్చుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక తొమ్మిదో వార్డు పరిధిలోని పంచముఖికాలనీలో బురుజుగడ్డ బంగారుమైసమ్మ ఆలయ కమాన్‌ను ఇటీవలే నిర్మించారు. ఆదివారం రాత్రి కమాన్‌తో పాటు హైమాస్ట్ లైట్లను మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. అంతకు ముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కౌన్సిలర్లు మూషా నరేందర్, పుల్లా నీరజ, కట్టా రవికిషన్‌రెడ్డితో పాటు కాలనీవాసులు ఆనంద్, దివ్యజ్యోతి, ఆంజనేయులుగౌడ్, రామేశ్వర్‌రెడ్డి, సుదర్శన్, సురేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీపల్లిలో పోతురాజు విన్యాసాలు



పోమాల్‌లో బోనాల ఊరేగింపు



కారుకొండలో..

ఘనంగా బోనాల ఉత్సవం

నవాబుపేట: చల్లంగా చూడాలమ్మ మైసమ్మ అంటూ.. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గ్రామ దేవతలకు భక్తులు బోనాలు సమర్పించారు. ఆదివారం పోమాల్, గడ్డతండా, పుట్టోనిపల్లి, కారుకొండ బంగారు మైసమ్మ, గ్రామదేవతల బోనాలు ఘనంగా నిర్వహించారు. బోనాలు అమ్మవార్లకు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో పురుషోత్తం, బంగ్లారవి, మాజీ సర్పంచ్‌లు కృష్ణ, శంకర్, మాజీ ఎంపీటీసీ గోపాల్, రాజ్‌కుమార్, జగన్, రమేష్, రాజు, శ్రీహరి, శ్రీశైలం, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: మండలంలోని లక్ష్మీపల్లిలో ఆదివారం ఘనంగా బోనాల వేడుక నిర్వహించారు. గ్రామంలో ప్రసిద్ధి చెందిన కనకదుర్గాదేవి ఆలయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాల మధ్య వేడుక ఘనంగా సాగింది. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

- కోనోకార్పస్ చెట్లను తొలగిస్తాం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రం మెట్టుగడ్డలోని రాష్ట్ర సదనం ఆవరణలో మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 55 లక్షల మొక్కలకు గాను ఇప్పటివరకు 35 లక్షల వరకు నాటామన్నారు. ప్రతి ఇంటికి ఐదు మొక్కల చొప్పున పంపిణీ చేస్తున్నామన్నారు. నాలుగేళ్ల క్రితం సరైన అవగాహన లేకుండా అప్పటి ప్రభుత్వం హరితహారంలో భాగంగా కోనోకార్పస్ మొక్కలను వివిధ చోట్ల నాటారన్నారు. వీటివల్ల ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని చాలా మంది తమ దృష్టికి తెచ్చినందున వెంటనే తొలగించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించామన్నారు. వాటి స్థానంలో వేరే మొక్కలు నాటుతామన్నారు. కాగా, అక్కడి పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.

అంబాభవాని సన్నిధిలో ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆషాఢమాస బోనాల పండుగ సందర్భంగా ఆదివారం జిల్లాకేంద్రంలోని పీర్లబాయి సమీపంలోని అంబాభవాని ఆలయంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను దత్తత తీసుకుని, వారి బాగోగులు చూడాలన్నారు. జిల్లాను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. కాగా, ఇక్కడి ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ.ఐదు లక్షలు ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అలాగే తొమ్మిదో వార్డు పరిధిలోని పంచముఖి కాలనీలో వెలసిన బురుజుగడ్డ మైసమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాలలో మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, డీఎఫ్‌ఓ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్ రాంలక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాద్రీ, మారేపల్లి సురేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, స్థానికులు లక్ష్మీనారాయణ పతంగి, మాండేకర్ విశ్వనాథ్, నరసింహారెడ్డి, బండి ఆనంద్, సురేష్ పాల్గొన్నారు.




ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు



అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



అడ్డాకుల: మూసాపేట మండలం వేముల గ్రామంలో ప్రధాన రోడ్డు పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఇక్కడ తక్కువ ఎత్తులో దిమ్మెపై ట్రాన్స్‌పార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీనికి సమీపంలోనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉంది. పాఠశాల విరామ సమయాల్లో విద్యార్థులు బయటకు వచ్చినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ వల్ల వారికి ప్రమాదం పొంచి ఉంది. అదేవిధంగా మూగజీవాలకు సైతం ముప్పే ఉంది. తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయడంతో పాటు తీగలు కూడా కిందకు ఉన్నాయి. దీనికి రక్షణ కంచె ఏర్పాటు చేయలేదు. ప్రమాదం సంభవించక ముందే సంబంధిత శాఖ అధికారులు స్పందించి తగిన రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

నూతన కార్యవర్గం ఎన్నిక

పాలమూరు: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా నూతన అధ్యక్షుడిగా బాలరాజు, సలహాదారుడు, మీడియా సెల్ కన్వీనర్‌గా రాజసింహుడును నియమించినట్లు కమిషన్ చైర్మన్ నాగేశ్వర్‌రావు వెల్లడించారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కమిటీని ఏర్పాటు చేసి ధ్రువీకరణ పత్రాలు, గుర్తింపు కార్డులను అందించారు. అదేవిధంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా చందు, సభ్యులుగా శంకర్, నరేందర్, రాము, బాలకృష్ణ, రషీద్, లక్ష్మణ్, అప్సర్, ఫర్వేజ్, జులేఫకర్ అలీ, మల్లిఖార్జున్, లలిత, శ్రీనివాసులు, లియాకత్ అలీలను నియామించారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం కమిషన్ పని చేస్తుందని, మోసపోయిన బాధితులతో పాటు నష్టపోయిన వారు సైతం కమిషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రానికి చెందిన మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు మదీనా జమీర్ నానమ్మ రాబియాబి ఆదివారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని రాత్రి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహయాదవ్, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, కొండయ్య, దాసర్‌పల్లి రాజు, రవీందర్‌గౌడ్, రవివర్ధన్, వి.రాజు తదితరులు ఉన్నారు.

మైసమ్మ చెంత జనజాతర





అడవిలో చెట్లకింద భక్తజనం

నవాబుపేట: మైసమ్మ చెంత ఆదివారం జనజాతర కొనసాగింది. ఆషాఢమాసం, సెలవు రోజు కావడంతో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. నైవేద్యాలు, బోనాలు సమర్పించి దీవించమని వేడుకున్నారు. దీంతో అడవి మొత్తం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. చెట్లకింద సేదతీరారు. విందులు ఏర్పాటు చేసుకున్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



మహబూబ్‌నగర్ రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన కురువ సామాజిక వర్గం విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ మేరకు పదోతరగతి, ఇంటర్ స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విద్యార్థులు ప్రతిభ చూపడం సంతోషించదగ్గ విషయమని మదాసీ, మదారి కురువ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విజయభాస్కర్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2023–24లో ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందించినట్లు వివరించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాలు అధిరోహించాలనిఆకాంక్షించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ధన్వాడ రాములు ఆధ్వర్యంలో మెమోంటో, శాలువ, క్యాష్ ప్రైజ్ అందజేశారు. అదేవిధంగా ఇటీవల పదవీ విరమణ ప్రభుత్వ ఉద్యోగులను సత్కరించారు. నాయకులు శివన్న, బాలయ్య, భరత్, బాబు, వేణుగోపాల్, సునీల్, మల్లేష్, మాధురి, మహేశ్వరమ్మ, గోకారి పాల్గొన్నారు.

జైపాల్‌రెడ్డికి ఘననివాళి



మిడ్జిల్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



జిల్లాకేంద్రంలో..

దేవరకద్ర: కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి నివాళులు అర్పించారు. ఆదివారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని స్ఫూర్తి ఘాట్‌ను ఆయన సందర్శించారు. జైపాల్‌రెడ్డి సేవలను కొనియాడారు.

మిడ్జిల్: మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ జైపాల్‌రెడ్డి వర్ధంతి ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, నాయకులు సాయిలు, గౌస్, మల్లికార్జున్‌రెడ్డి, నర్సింహ, బాలయ్య, అశోక్, జహంగీర్, సత్యం, జహీర్, లక్ష్మారెడ్డి, పర్వతాలు, ఉస్మాన్, పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రం లోని డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఘన నివాళి అర్పించారు. నాయకులు చంద్రకుమార్‌గౌడ్, సీజే బెన్‌హర్, అజ్మత్‌అలీ, అవేజ్‌అహ్మద్, జె.చంద్రశేఖర్, ఫహీం అంజద్, గులాం జహీర్, మూసా చావుస్, అఫ్సర్‌అలీ, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బెల్టు గ్రేడింగ్ పరీక్షలు

స్టేషన్ మహబూబ్‌నగర్ : స్వీయ రక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే దూ ఇండియా ఫౌండర్ జి.కృష్ణయ్య అన్నారు. జిల్లా కేంద్రం అప్పన్నపల్లి కమ్యూనిటీహాల్‌లో పట్టణ ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం కరాటే, మార్షల్ ఆర్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందని అన్నారు. వీటిని నేర్చుకోవడం వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మానసికంగా ఎదగవచ్చని అన్నారు. ఇన్‌స్ట్రక్టర్ తిరుమలేష్, బ్లాక్ బెల్టు విద్యార్థులు నిశాంత్, అక్షర, నందిని, సాయివర్షిని, అభినవ్, ఎస్.నందిని పాల్గొన్నారు.



కరాటే బెల్టులు సాధించిన విద్యార్థులు



మూసాపేట బీటీరోడ్డుపై ఏర్పడిన గుంతలు

అధ్వానంగా రోడ్డు

అడ్డాకుల: 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి మూసాపేట బస్టాండ్ వరకు ఉన్న బీటీరోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఎస్సీ హాస్టల్ దాటిన తర్వాత కొత్తగా ఏర్పాటైన వెంచర్ వద్ద రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ గుంతలు ఏర్పడంతో పాటు వర్షం నీళ్లు రోడ్డు కిందకు వెళ్లే అవకాశం లేకపోవడంతో రోడ్డుపైనే నీళ్లు నిలుస్తున్నాయి. ప్రతి నిత్యం కొత్తకోట, మహబూబ్‌నగర్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులతో పాటు ఆటోలు, ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగిస్తాయి. పెద్ద పెద్ద గుంతల మూలంగా ఆర్టీసీ డ్రైవర్లు బస్సులను ఊర్లోకి తేవడానికి వెనుకడుగు వేస్తున్నారు. కొందరు డ్రైవర్లు రోడ్డు బాగోలేదనే సాకుతో రహదారి పైనే ప్రయాణికులను దింపేసి వెళ్తున్నారు. ఇటీవల ఇక్కడ గుంతల్లో పాత రోడ్డు బీటీ కంకర వేసినా పెద్దగా ప్రయోజనం లేదు. సుమారు ఏడాది కిందటే హైవే నుంచి బస్టాండ్ వరకు బీటీ రెన్యూవల్ చేసినా అప్పుడే గుంతలు ఏర్పడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

గుంతలమయంగా..



రాజాపూర్: మండలపరిధిలోని పలురోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తుండడంతో గుంతల్లో నీరు నిలుస్తోంది. ఫలితంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మండలంలోని మల్లేపల్లి, రాయపల్లి, తదితర గ్రామాల రోడ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అధికారులు స్పందించి గుంతల్లో కనీసం మట్టినైనా వేసి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ పనుల్లో బిజీ.. బిజీ



కోయిల్‌కొండ దగ్గర పొలంలో గొర్రుతో చదును చేస్తున్న అన్నదాత



నారు తీస్తున్న మహిళా రైతు కూలీలు



రాంపూర్‌లో కందిపంటలో గుంటకతో కలుపు తీస్తున్న రైతు

కోయిల్‌కొండ: మండలంలో బోరు బావుల వద్ద వ్యవసాయ పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. గత పదిరోజులుగా కురిసిన వర్షాలకు నాట్లు వేయడంలో రైతన్నలు బిజీ..బిజీగా గడుపుతున్నారు. కంది, జొన్న పంటలకు రైతులు కలుపుతీత, ఎరువులు వేస్తున్నారు. కూలీల కొరత ఏర్పడటంతో నాట్లు వేయడానికి ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకువస్తున్నారు. దుక్కులు సిద్ధం చేయడంతో పాటు మడుల్లో నారు తీస్తూ..నాట్లు వేయడంలో నిమగ్నమవుతున్నారు.



జయనగర్‌తండాలో..